జగనన్న కాలనీపై నిర్లక్ష్యపు నీడ



పరదేశిపాలెంలో జగనన్న కాలనీ



గృహాల ముందు తుప్పలు

- రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు లేవు
- తాగునీటికి కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే
- రాత్రయితే పాముల బెడద
- డంపింగ్‌యార్డ్ నుంచి పొగ
- పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- 350 కుటుంబాలకు తప్పని అవస్థలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి పరదేశిపాలెం జగనన్న కాలనీలో కనీస సౌకర్యాలు లేక నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో సమస్యలపై మహిళలు కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్‌లో అనేక సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని వాపోతున్నారు.

కాలనీ ఏర్పడిందిలా..

గత ప్రభుత్వ హయాంలో పరదేశిపాలెంలో 2020లో స్థానికులతో పాటు కాపులుప్పాడ, రెడ్డిపాలెం, సోమన్నపాలెం, చేపలుప్పాడ, మంగమారిపేట, తిమ్మాపురం ప్రాంత వాసులకు ఇక్కడ ఇళ్లను కేటాయించారు. 2021నాటికి సుమారుగా వంద ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. తరువాత 2022- 23 నాటికి మొత్తం 350 ఇళ్ల నిర్మాణం పూర్తయి, పెద్ద కాలనీగా ఏర్పాటైంది. **కాలనీకి విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు ఏర్పాటు చేశారు.** ప్రతి వీధికి **రోడ్లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం** చేశారు. **ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పనుల్లో** జాప్యం జరిగింది. ఇక్కడి ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని కూటమి నాయకులు వాగ్దానం చేశారు. ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు అవుతున్నా ఒక్క నాయకుడూ ఇటువైపు చూడలేదు.



కాలనీలో రోడ్డు మీద ప్రవహిస్తున్న మురుగునీరు



కాలనీకి చేరుకునే ప్రధాన రహదారి పరిస్థితి

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

- కాలనీలో తాగేందుకు నీరు లేదు. డ్రైనేజీలు లేవు, వీధిలైట్లు లేవు, రోడ్లు లేవు, రవాణా సౌకర్యం లేదు.
- కొండ ప్రాంతం కావడంతో రాత్రి అయితే విష సర్పాలు నివాసాల్లోకి చొచ్చుకుని వస్తున్నాయి.
- డంపింగ్‌యార్డ్ సమీపంలో ఉండటంతో పొగతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
- కాలనీలో ఎవరైనా మరణిస్తే కిలోమీటర్ల దూరం తీసుకుని వెళ్లి దహన సంస్కారాలు చేయాల్సిన పరిస్థితి.
- గతంలో రేషన్ ఇంటికి వచ్చేది. ఇప్పుడు కాపులుప్పాడ, నగరపాలెం వెళ్లాల్సి వస్తోంది.
- **దోమలతో అవస్థలు**
- మట్టి రోడ్డు కావడంతో వర్షాల సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పరదేశిపాలెం నుంచి వెళ్లాలంటే గెడ్డ పొంగి పోతుంది.

ఇలా ఉంటే తాము ఎలా జీవనం సాగించాలంటూ కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడ పెద్ద కాలనీ నిర్మిస్తే నేటి ప్రభుత్వం కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'మా సమస్యలు, బాధలు ఎవరితో చెప్పాలి? ప్రజా ప్రతినిధులు ఇక్కడ ఒక్క రోజు ఉంటే తమ సమస్యలు ఏమిటో పూర్తి స్థాయిలో తెలుస్తాయి' అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమను మనుషులుగా గుర్తించి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మంచినీటి కోసం ఎంతో దూరం వెళ్లాలి



కాలనీలో తాగునీరు తీవ్ర సమస్యగా మారింది. మంచినీటికి కె.నగరపాలెం, కాపులుప్పాడ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవాలి. రవాణా వ్యవస్థ లేదు. కాలనీకి సౌకర్యాలు కల్పించలేదు. నాయకుల నిర్లక్ష్యం వల్లనే ఇక్కడ సమస్యలు పరిష్కారం కావడం లేదు.

– జి.దేవి, జగనన్న కాలనీ, పరదేశిపాలెం

మమ్మల్నీ మనుషులుగా గుర్తించండి చాలు



350 గడపలు ఉన్నా సౌకర్యాలు మాత్రం లేవు. రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయమని జోనల్ ఆఫీసుల్లో, కలెక్టర్ ఆఫీసుల్లో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. మమ్మల్ని మనుషులుగా గుర్తించి, మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయండని బతిమాలినా అధికారుల్లో, నాయకుల్లో చలనం రావడం లేదు. దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

– కె. నూకరత్నం, జగనన్న కాలనీ, పరదేశిపాలెం

పాములు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి



కాలనీలో వీధి లైట్లు లేవు. దీంతో వర్షాకాలంలో రాత్రివేళల్లో బయటికి వెళ్లాలంటే భయంగా ఉంటోంది. విషసర్పాలు నివాసాల్లోకి వచ్చేస్తున్నాయి. సాయంత్రమైతే చాలు డంపింగ్ యార్డ్ నుంచి పెద్ద ఎత్తున పొగ వచ్చేస్తుంది. దీంతో వ్యాధుల బారిన పడుతున్నాం.

– జి. వరాలమ్మ, జగనన్న కాలనీ, పరదేశిపాలెం

అధికారులు స్పందించకుంటే ఆందోళన



జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం వెనకడుగు వేస్తోంది. కాలనీలో సౌకర్యాలు ఏర్పాటు చేస్తే జగన్‌కు పేరు వస్తుందనే ఆలోచన తప్ప, ప్రజలకు కష్టాలు తీరుతాయనే ఆలోచన అధికారులకు, ఎమ్మెల్యేకు లేదు. పూర్తిగా ఏర్పాటు చేసిన కాలనీలో సౌకర్యాలు ఏర్పాటు చేయలేని దయనీయ స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. ఇక్కడి సమస్యలపై జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే స్థానికులతో కలిసి ఆందోళన చేయాల్సిన పరిస్థితి వస్తుంది.

– దౌలపల్లి కొండబాబు, కార్పొరేటర్, జీవీఎంసీ 4వ వార్డు.

చంద్రబాబుకు పాలన చేతకాక హిట్లర్ వేషాలు



బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: ఎన్నికల ముందు ప్రజలకు అలవి కాని హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిని నెరవేర్చలేక చతికిలపడ్డారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు వాటిని గుర్తు చేస్తున్న ప్రతిపక్ష నాయకులపై రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వేధింపులకు దిగి హిట్లర్ వేషాలు వేస్తున్నారన్నారు. శుక్రవారం ఆయన సంగివలసలో మాట్లాడారు. 40 శాతం ఓటింగ్ కలిగిన ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెడ్‌బుక్ బాధితులైన తమ నాయకులను పరామర్శించడానికి, ప్రజల తరపున సంక్షేమ పథకాల గురించి ప్రశ్నించడానికి ప్రజాక్షేత్రంలోకి వస్తే చంద్రబాబు వణికిపోతున్నాడన్నారు. ఎక్కడికక్కడ నిర్బంధాలతో అభిమానులను నియంత్రించే పనులు చేస్తున్నారన్నారు. కుళ్లు, కుతంత్రాలకు పెట్టింది పేరైన చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భయపడరన్నారు. భవిష్యత్తులో టీడీపీ కాలగర్భంలో కలవక తప్పదని హరికిరణ్ రెడ్డి హెచ్చరించారు.

ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



గాలిలో బెలూన్లు వదిలి పోటీలు ప్రారంభిస్తున్న భారత జట్టు క్రికెటర్ కోన శ్రీకర్ భరత్

పీఎం పాలెం: విద్యార్థులు మానసిక ఆరోగ్యాల కోసం చిన్నతనం నుంచి చదువుతో పాటు క్రీడలకూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలని భారత జట్టు క్రికెట్ క్రీడాకారుడు కోన శ్రీకర భరత్ అన్నారు. జీవీఎంసీ 8వ వార్డులోని గ్రీన్‌డేల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ స్కూల్ బాస్కెట్ బాల్ పోటీలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. స్కూల్ చైర్మన్ సుంకరి రవీంద్ర, ప్రిన్సిపాల్ దివ్యదాస్ మాట్లాడుతూ నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. విజయా రవీంద్ర, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల సదనాన్ని సందర్శించిన పీడీ



పిల్లలకు కొత్త కంచాలు, గ్లాసులు అందిస్తున్న పీడీ రామలక్ష్మి

భీమునిపట్నం: భీమిలిలోని ప్రభుత్వ బాలికల బాల సదనాన్ని జిల్లా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలక్ష్మి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలు ఉండే గదులు, వంటశాల, సదుపాయాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. వారికి కొత్త కంచాలు, గ్లాసులు, నైట్ డ్రెస్‌లు, కాస్మోటిక్స్ అందించారు. భీమిలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీదేవి, బాలసదనం సూపరింటెండెంట్ ఊర్మిళ పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి వీవీ రామారావు

తగరపువలస: ఏఐటీయూసీ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు వీవీ రామారావు కార్మిక పక్షపాతి అని భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు కొనియాడారు. శుక్రవారం ఆయన 4వ వర్ధంతి సందర్భంగా గుజ్జు రామునాయుడు భవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, చిల్ల నరసింహులు, కొండపు ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ ఒకరు మృతి

తగరపువలస: గడ్డిమందు తాగి, కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ముదపాక అచ్చిబాబు (35) శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఆనందపురం సీఐ వాసునాయుడు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆనందపురం మండలం బంటుపల్లి కళ్లాలకు చెందిన అచ్చిబాబు మద్యానికి బానిసయ్యాడు. గత నెల 29న మద్యం సేవించి ఇంటికి వచ్చిన అతడు భార్య భవాని, పక్కింట్లో ఉంటున్న బంధువులతో తగాదాకు దిగాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చి పొదల్లో గడ్డి మందు తాగి పడిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కేజీహెచ్‌లో చేర్పించగా, శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య భవానీ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు దర్యాప్తు చేస్తున్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని ఆందోళన

మధురవాడ: ఏడాదికి పైగా బకాయి పడ్డ వేతనాలు వెంటనే చెల్లించాలని జీవీఎంసీ క్లాప్ వాహనాల లోడర్స్, సూపర్ వైజర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద ప్లకార్డులు, బ్యానర్లతో నినదించారు. జెడ్సీ కనక మహాలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. మద్దిలపాలెం జోన్ సీఐటీయూ నాయకులుడి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్ ఎస్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఒకేచోట పింఛన్ల పంపిణీ



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఒక్క చోటే పెన్షన్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా

మధురవాడ: గత ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి పింఛన్‌లు పంపిణీ చేయగా, కూటమి ప్రభుత్వం వాటిని ఒకేచోట అందజేస్తోంది. మధురవాడ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ–2లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పౌజ్ పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు మహిళలను ఒకే చోటికి పిలిచి పింఛన్లు అందజేశారు. కాగా.. ఎమ్మెల్యే కాలనీలోకి వస్తారని తమ సమస్యలు చెప్పుకుందామని ఉదయం నుంచి ఎదురుచూస్తే, కనీసం ఐదు నిమిషాలు కూడా ఉండకుండా వెళ్లిపోయారని అదే ప్రాంతానికి చెందిన అన్నపూర్ణ అనే మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు సరిగా రావడం లేదని, మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయని, మహిళలు విజయ, లక్ష్మి, హేమలత తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులు ఈ విషయాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఆయన కారులో నుంచే మహిళల నుంచి వినతిపత్రం స్వీకరించారు. జెడ్సీ కె.కనకమహాలక్ష్మి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

భీమునిపట్నం: భీమిలి తీర ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అనేక అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వాటిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని మత్స్యకారులకు సంబంధించిన గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు కోరారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇక్కడ తీరంలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను కోర్టు ఆదేశాల మేరకు కూల్చివేయాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు ఖాతా, బీమా తప్పనిసరి



ఆర్థిక చేరిక కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌బీఐ ఉన్నతాధికారులు

తగరపువలస: ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాతో పాటు బీమా సదుపాయాలు కలిగి ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ (డ్రైవ్) సురేందర్ రాణా అన్నారు. భీమిలి మండలం టి.నగరపాలెం, తాటితూరు పంచాయతీ వాసులకు దివీస్ కల్యాణమండపంలో ఆర్థిక చేరిక కేంద్రీకృత ప్రయత్నంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంజేడీవై, పీఎం జీవనజ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన గురించి తెలియజేశారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చడమే ఎస్‌బీఐ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, బ్యాంకు జీఎం(అమరావతి) హేమంత్‌కుమార్, డీజీఎం రాహుల్ సాంకృత్య, ఆర్ఎం అభిషేక్‌కుమార్, సీఎం ఎఫ్ఎల్ సీహెచ్ వేణుగోపాల్, ఎల్‌డీఎం శ్రీనివాస్, చిట్టివలస బ్రాంచ్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, మేనేజర్ రాఘవేంద్రన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల మధ్య తగాదాలు లేకుండా ఉండేందుకే రీ సర్వే



మాట్లాడుతున్న సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డుల రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు

పద్మనాభం: రైతుల మధ్య తగాదాలు రాకుండా ఉండేందుకే రీ సర్వే చేస్తున్నామని సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డుల రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మండలంలోని గంధవరం గ్రామంలో ఇటీవల జరిగిన భూసర్వేపై శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా సర్వే చేశామన్నారు. రీ సర్వే చేసిన తర్వాత రైతులు తమ భూములను చట్టపరంగా క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని తెలిపారు. అనంతరం ఆయన తునివలసలో పర్యటించి జగననన్న కాలనీ లేఅవుట్‌ను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పీజీఆర్ఎస్ వినతులను ఎంతవరకు పరిష్కరించారో పరిశీలించారు. ఆయన వెంట భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దార్ కె.ఆనందరావు పాల్గొన్నారు.

భీమిలీ సీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్

ఆస్పత్రి నిర్వహణ, వైద్య సేవల పరిశీలన



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిరప్రసాద్

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ని కలెక్టర్ హరేందిరప్రసాద్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కడ రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో పరిశీలించారు. చికిత్స ఎలా అందుతుందో రోగులనడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్ వార్డులను పరిశీలించి, అక్కడి వసతులు, భోజన సదుపాయాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఓపీ, కట్లు కట్టే గది, ఆస్పత్రిలో ఉన్న మందులు మొదలైన వాటిని పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు లేకపోతే ఆస్పత్రి నిధుల నుంచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులు ఎంతమంది వస్తున్నారు, ప్రసవాలు ఏమేరకు జరుగుతున్నాయనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత, ఇతర ఆరోగ్య సమస్యలున్న గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ప్రధాన వైద్యుడు వైద్యనిపుణుల కొరతను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో ఎముకలు, చర్మవ్యాధుల నిపుణులు లేరని, వారి అవసరం ఎక్కువగా ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్, వారి నియామకానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డామిట్.. కథ అడ్డం తిరిగింది

సన్మానం పేరుతో రూ.100 వసూలును వ్యతిరేకించిన పింఛన్‌దారులు

పీఎం పాలెం: కొంతమంది చోటా నాయకులు ప్రజల సొమ్ముతో సత్కారాలు చేసి గుర్తింపు పొందాలన్న ధ్యాసలో ఉంటారు. కానీ సీన్ రివర్స్ అయితే.. నలుగురిలో నవ్వులపాలు కావల్సిందే. ఇక్కడా అదే జరిగింది. పీఎం పాలెం ఆఖరు బస్టాప్‌నకు సమీపంలో ఉన్న బీ–2 జెఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగి ఇటీవల బదిలీ అయ్యాడు. ఆయనకు సన్మానం చేద్దామని కాలనీలో పెద్దమనిషిగా గుర్తింపు పొందిన జీవన్‌రావుకు తట్టింది. పెన్షన్ తీసుకునేటప్పుడు అందులోంచి ఒక్కొక్కరు వంద రూపాయలు చెల్లించడానికి ఊ కొట్టారు. శుక్రవారం వంద చెల్లించారు. ఇంతలో ఏమయిందో.. అలా ఇవ్వడం తమకు ఇష్టం లేదని, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇచ్చేయాలని గొడవకు దిగారు. చేసేదేమీ లేక ఎవరి వంద వాళ్లకు ఇచ్చి, ఊపిరి పీల్చుకున్నాడు. ఈ విషయమై జీవన్‌రావును ప్రశ్నించగా ఎవరి వద్దా తాను బలవంతంగా వసూలు చేయలేదని, స్వచ్ఛందంగానే చెల్లించారని తెలిపారు. అంతలోనే తిరిగి ఇచ్చేయమనడంతో ఎవరి సొమ్ము వాళ్లకు ఇచ్చేశానని వివరణ ఇచ్చాడు.

తల్లిపాలతో ఎన్నో ప్రయోజనాలు

భీమునిపట్నం: పిల్లలకు తల్లిపాలు అందివ్వడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి రమాలక్ష్మి అన్నారు. భీమిలి తోటవీధి, అప్పికొండవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, నోడల్ అధికారులు ఝాన్సీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

14 నెలల్లో ఒక్క కొత్త పింఛన్ ఇచ్చారా?

- ఈ రోజు ఇచ్చినవి స్పౌజ్ పెన్షన్లు మాత్రమే
- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను



మజ్జిపేటలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను



హాజరైన మజ్జిపేట పంచాయతీ ప్రజలు

తగరపువలస: ఈ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14 నెలల గడచినా ఒక్క కొత్త పెన్షన్ అయినా ఇవ్వకుండా సంబరాలు చేసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ రోజు ఇచ్చినవి స్పౌజ్ పెన్షన్లు మాత్రమే అని తెలిపారు. భీమిలి మండలం మజ్జిపేట పంచాయతీలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి 6 మాసాలకు సమీక్ష జరిపి అర్హులకు కొత్త పెన్షన్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇచ్చేవారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వంలో వితంతులకు గానీ, 50 ఏళ్లు నిండిన వారికి, దివ్యాంగులకు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడిన వారికి ఎవరికీ కొత్త పెన్షన్ ఇవ్వలేదని చెప్పారు.

ఆ బకాయిలన్నీ చెల్లించాలి

అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మొత్తం కాకుండా అర ఎకరం ఉన్న రైతుకు కూడా ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం శనివారం ఈ పథకాన్ని ప్రారంభించి రైతుకు రూ.5 వేలే ఇవ్వనున్నట్టు ప్రకటించారన్నారు. గతేడాది బకాయితో పాటు ఒక్కో రైతుకు మొత్తం రూ.40వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు అని గొప్పలకు పోయిన చంద్రబాబు నిరుద్యోగ భృతి కింద 14 నెలల బకాయిలు కలిపి రూ.42వేలు వంతున ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భూములన్నీ దోచి పెడుతున్నారు

జిల్లాలో ప్రభుత్వ భూములను పప్పు బెల్లాలు పంచినట్టు రూ.0.99 పైసలు, రూ.1కు ఎకరం భూమి వంతున దోచి పెడుతున్నారన్నారు. ఈ భూదందాలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరు నిలదీయాలన్నారు. కూటమి ప్రభుత్వం మోసం చేసింది కాబట్టే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం ప్రజల మధ్య ధైర్యంగా నిర్వహించగలుగుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదు కాబట్టి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని తూతూ మంత్రంగా వందలాది పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహించుకుంటున్నారన్నారు.

బాబు అడుగుపెడితే క్షామమే..

బాబు అడుగు పెడితే రాష్ట్రం కరువు కోరల్లో ఉంటుందనడానికి వర్షాలు కురవకపోవడమే నిదర్శనమన్నారు. జగనన్న పాలనలో సకాలంలో పుష్కలంగా వర్షాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా పెట్టుబడి సాయం, ఎరువులు, డీఏపీ, యూరియా, విత్తనాలు సరఫరా చేస్తే రైతులు పంటలు పండించుకునేవారని గుర్తు చేశారు. కేవలం ఎల్లో మీడియాలో తప్ప వాస్తవంగా ఎక్కడా అభివృద్ధి, సంక్షేమం అమలు కావడం లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల మధ్య తిరగడానికి భయపడుతున్నారన్నారు. మీ మధ్యకు వచ్చిన కూటమి నాయకులను కచ్చితంగా నిలదీసి జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతో పాటు సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని నిలదీయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ మజ్జి సూరినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి శ్రీనివాసరావు, సరగడ రఘునాధరెడ్డి, కొవ్వాడ అప్పలనాయుడు, మజ్జి నారాయణరావు, సమ్మిడి శ్రీనివాసరావు, దన్ని పైడిరాజు, చెల్లూరు నగేష్, బొడ్డు దుర్గారావు, పాలూరు కాసు, తుపాకుల అప్పలరాజు, యర్రాజి పైడిశెట్టి, నడిమింటి స్వామినాయుడు మజ్జి పైడిరాజు, మజ్జి లక్ష్మణరావు, మజ్జి కారునాయుడు, మద్దిల శివకుమార్, చెల్లూరు రావణ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి ఆకస్మిక తనిఖీ



కస్తూర్బా విద్యాలయంలో వంటకాలను రుచి చూస్తున్న ఎస్‌వో జ్ఞానవేణి

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. కృష్ణాపురం కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించి, మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూశారు. ఇదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, ఆటపాటలతో కూడిన విద్య ఏ మేరకు అందిస్తున్నారో ఆరా తీశారు. తదుపరి పద్మనాభం ఏఎస్ఎం సబ్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ సర్వేల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మీనా కుమారి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీలో శుక్రవారం టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 50 మందికి స్క్రీనింగ్ చేసి 15 మంది కఫం సేకరించి పరీక్షలకు పంపించారు. సర్పంచ్ లొడగల రమణ, పంచాయతీ కార్యదర్శి అనురాధ, టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్ ఇ.వీరబ్రహ్మం, హెచ్‌వీ రోహిణి, సీహెచ్‌వో అరుణ, కృష్ణ, అనూష హాజరయ్యారు.

మహాలక్ష్మీ.. మనసా స్మరామి



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి



తమలపాకుల అలంకరణలో వాసవీమాత



తులసి మాలల అలంకరణలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి

శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయం, సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు, అష్టలక్ష్మీ ఆలయం, రుషికొండలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భీమిలిలోని వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని తమలపాకులతో అలంకరించారు.

– తగరపువలస/భీమునిపట్నం,కొమ్మాది



రుషికొండ శ్రీవారి ఆలయంలో సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్న మహిళలు

బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



ఎమ్మెల్యే గంటాను సన్మానిస్తున్న ఎంపీపీ శారదా ప్రియాంక, వెంకటరావు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ మూడు కిలో మీటర్ల నిడివిలో రూ.80లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీనిలో పక్కుర్తి వానిపాలెం, గంటపేటలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.15లక్షలు, కోరాడ వీధిలో మజ్జి రామునాయుడు ఇంటి దగ్గర కల్వర్టు నిర్మాణానికి రూ.2లక్షల మండల పరిషత్ నిధులను ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక మంజూరు చేశారు. తర్లువాడ పంచాయతీలో బీటీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టినందుకు గంటా శ్రీనివాసరావును ఎంపీపీ శారదా ప్రియాంక, మజ్జి వెంకటరావు దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌బీ నాయుడు, తాత్రాజు అప్పారావు, మాజీ సర్పంచ్ బాలి అయ్యప్ప పాల్గొన్నారు.